క్లుప్తంగా

31న చిత్రలేఖన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తి సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలను జిల్లా కేంద్రంలోని పాత గౌతమి డిగ్రీ కళాశాలలో ఈనెల 31న ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు జేపీ.మహేష్‌కుమార్, సి.నరేష్, బోల యాదయ్య, ఎన్.అనూష శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. సబ్ జూనియర్ 1 నుంచి 5వ తరగతి అంశం ప్రకృతి అందం, జూనియర్ 6 నుంచి 10వ తరగతి అంశం పండుగ, సీనియర్ విభాగం ఇంటర్ నుంచి డిగ్రీ వరకు పర్యావరణ కాలుష్యం–పర్యావరణ సంరక్షణపై పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు డ్రాయింగ్, పెయింటింగ్ సామగ్రి వెంట తీసుకొనిరావాలని కోరారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం ఇస్తామన్నారు.

వివాహిత అదృశ్యం

జడ్చర్ల: మండలపరిధిలోని శిఖర్‌గానిపల్లిలో ఓ వివాహిత అదృశ్యం అయినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం బిల్లకల్ గ్రామానికి చెందిన నిరంజన్‌కు లలితను ఇచ్చి 2010లో వివాహం చేశారు. అయితే ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు రావడంతో లలిత నాలుగు నెలల కిందట శిఖర్‌గానిపల్లిలోని అక్క ఇంటికి వచ్చింది. కాగా ఈనెల 14న ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అక్క బోయ మణెమ్మ శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహమ్మదాబాద్ ఇద్దరు యువతులు

మహమ్మదాబాద్: ఇంటినుంచి బయటికి వెళ్లివస్తామని వెళ్లిన ఇద్దరు యువతులు అదృశ్యమైన ఘటనలు వేర్వేరు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామానికి చెందిన ఓ యువతి 19 ఈనెల 23న సాయంత్రం 4గంటల సమయంలో కాలకృత్యాలకు వెళ్లివస్తానని ఇంటి నుంచి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.
అదేవిధంగా మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన కుమ్మరి అంజిలయ్య కుమార్తె 26న సంతకు వెళ్లివస్తానని బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

మహమ్మదాబాద్: ప్రేమపేరుతో ఓ యువతిని శారీరకంగా లొంగదీసుకుని చివరకు వివాహం చేసుకోనని మోసం చేసిన ఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని చాదర్‌పల్లి పెద్ద తండాకు చెందిన ఓ అమ్మాయిని అదే తాండాకు చెందిన యువకుడు ప్రేమిస్తున్నానని వలలో వేసుకున్నాడు. వివాహం చేసుకుంటానని శారీరకంగా లోబర్చుకున్నాడు. అనంతరం వివాహం చేసుకోబోనని బుకాయించడంతో అమ్మాయి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించుకోండి

చిన్నచింతకుంట: బీడీ కార్మికుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేఎస్ దేవదానం తెలిపారు. ఈ మేరకు 29న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లా పీఎఫ్ అధికారి రమేష్‌తో పాటు పలువురు అధికారులు హాజరు కానున్నారని వివరించారు. మండలంలోని బీడీకార్మికులు హాజరై పీఎఫ్‌లో ఏవైనా సమస్యలు ఉంటే సరిచేసుకోవాలని కోరారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించేవరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని జేఏసీ మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. రిలేదీక్షల్లో శనివారం పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని 12 గ్రామాల ప్రజల మద్దతుతో 127 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు గానీ, స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో స్కూల్ ఆవరణలో శనివారం న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. న్యూమాంక్స్ కుంగ్‌ఫూ సౌతిండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కనకం యాదవ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా పీపీ బెక్కం జనార్దన్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్ పాల్గొన్నారు. విద్యార్థులకు బెల్టులు అందజేశారు. ఇన్‌స్ట్రక్టర్లు భరత్, రాఘవేందర్‌గౌడ్, షాఫిన్ పాల్గొన్నారు.



ఇప్పటికీ మట్టిరోడ్లే గతి

- ఎక్కడికక్కడ దెబ్బతిన్న సీసీలు
- అబ్దుల్‌కలాంనగర్‌లో అన్నీ సమస్యలే!
- మణికంఠకాలనీలోనూ అదే పరిస్థితి

20వ వార్డులో జనాభా: 5,640
ప్రధాన వీధులు: మర్లు (కొంతభాగం), ఎంప్లాయీస్ కాలనీ, దుబాయి బిల్డింగ్ ప్రాంతం, మణికంఠకాలనీ (కొంత భాగం), అబ్దుల్‌కలాంనగర్, అంజనాద్రినగర్

వార్డ్ వాచ్



అబ్దుల్‌కలాంనగర్‌లోని ఓ గల్లీ..



మణికంఠకాలనీలోని మట్టిరోడ్డు



చెన్నకేశవస్వామి ఆలయం వెనుక గల్లీలో మట్టిరోడ్డు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 20వ వార్డు పరిధిలో సగం వరకు మట్టి రోడ్లే ఉన్నాయి. చాలా చోట్ల సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. మర్లులోని ప్రధాన రోడ్డు సగం బీటీ, మరో సగం సీసీ చేసినా మూడు నాలుగు చోట్ల పెద్ద గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుకు అడ్డంగా ఎక్కడికక్కడ మిషన్ భగీరథ పథకం పైపులైన్ నుంచి కొందరు ఇంటింటికి నల్లా తీసుకోవడానికి తవ్వి సరిగా పూడ్చలేదు. ఈ పరిస్థితి అన్ని వీధుల్లోనూ నెలకొనగా అంతటా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఓపెన్ ప్లాటు కనిపిస్తే చాలు చుట్టుపక్కలవారు చెత్తాచెదారంతో నింపేస్తున్నారు. కొందరు ఇళ్ల యజమానులు స్వచ్ఛ ఆటోకు చెత్త ఇవ్వడం లేదు. అబ్దుల్‌కలాంనగర్, మణికంఠకాలనీలో దాదాపు 90 శాతం మట్టిరోడ్లే దిక్కయ్యాయి. చెన్నకేశవస్వామి ఆలయం వెనుక భాగంలోని ఇళ్లు ఎత్తు ప్రదేశంలో ఎగుడుదిగుడుగా ఉన్నాయి. ఇక్కడ మట్టి రోడ్లే ఉండటంతో వర్షాకాలంలో నీరంతా ఏరులై పారుతుంది. నడవడానికి వీలుండదు. ఇక వాహన రాకపోకల మాట దేవుడెరుగు అన్నట్లుగా మారింది. కొన్ని గల్లీలలోని సీసీ రోడ్లు చాలావరకు ధ్వంసమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అబ్దుల్‌కలాంనగర్‌లోని పంపు వద్ద రోడ్డుపైనే నీటితో మడుగులా తయారైంది. ఫాతిమామసీదుకు సమీపంలోని కూడలిలో విద్యుత్ స్తంభానికి లెక్కలేనన్ని తీగలు, కేబుల్ వైర్లు చుట్టేశారు. ఇవి ప్రమాదకరంగా ఉన్నాయని చుట్టుపక్కలవారు వాపోతున్నారు.

రూ.2.83 కోట్లతో పనులు చేపట్టాం



ఈ మూడేళ్ల కాలంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.2.83 కోట్లు వెచ్చించాం. అబ్దుల్‌కలాంనగర్, మణికంఠ కాలనీలలో ఎక్కువగా మట్టి రోడ్లు ఉన్నది వాస్తవమే. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో ఇటీవల రూ. రెండు కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఇప్పటికే కొన్ని పనులు టెండర్ల దశలో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా చూస్తాం. ఓపెన్ ప్లాట్లలో ఎవరూ చెత్తాచెదారం వేయొద్దు. ఇంటింటికీ వచ్చే మున్సిపల్ స్వచ్ఛ ఆటోకు మాత్రమే అందజేయాలి.

– రావుల అనంతరెడ్డి,
కౌన్సిలర్, 20వ వార్డు

పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారు



మా కాలనీలో రోడ్లు ఊడ్చడానికి, డ్రెయినేజీ తీయడానికి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో చిన్నపిల్లలు, విద్యార్థులు ఆడుకోవడానికి బయటకు పంపించాలంటేనే భయమేస్తుంది. కొందరు ఇళ్ల యజమానులు ఎక్కడబడితే అక్కడ ఓపెన్ ప్లాట్లలో చెత్తాచెదారంతో వేస్తున్నారు. దానిని తొలగిస్తే బాగుంటుంది. గల్లీలలోని సీసీ రోడ్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. వెంటనే మరమ్మతు చేయించాలి. ఇప్పటికైనా మట్టిరోడ్లను సీసీగా మార్చాలి.

– బాలరాజు,
గురుకుల ఫ్యాకల్టీ, దుబాయి బిల్డింగ్ ఏరియా

మట్టిరోడ్లే దిక్కయ్యాయి



మా కాలనీ ఎక్కడ చూసినా మట్టిరోడ్లే దిక్కయ్యాయి. చెన్నకేశవస్వామి ఆలయం వెనుక భాగంలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. సీసీ రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. ఇటీవల ఇళ్ల యజమానులు కొందరు డబ్బులు పెట్టి 2 విద్యుత్ స్తంభాలు తెచ్చారు. వాటికి తీగలతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. మిషన్ భగీరథ పథకం తాగునీరు పైపుల ద్వారా సన్నగా వస్తుంది. ఈ ప్రాంతంలో కొన్ని ఇళ్లు ఎత్తు ప్రదేశంలో ఉండటంతో ఈ సమస్య ఎదురవుతోంది.

– జహంగీర్,
ఆటో డ్రైవర్, అబ్దుల్‌కలాంనగర్

వాయిదా పద్ధతుల్లో రుణాలు చెల్లించండి

మహమ్మదాబాద్: డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను వాయిదా పద్ధతుల్లో చెల్లించుకోవాలని బ్యాంకు లింకేజీ డీపీఎం సలోమీ తెలిపారు. మహమ్మదాబాద్‌లో శనివారం సంఘాల వారితో మాట్లాడారు. తీసుకున్న రుణాలు ఎప్పటికైనా చెల్లించాల్సిందేనని తెలుపగా మూడు వాయిదాల్లో చెల్లిస్తామని ఒప్పుకున్నారు. మూడు సంఘాల్లో రికార్డులు, వారు తీసుకున్న రుణాలను పరిశీలించగా వీఓఏలు, సీసీల వద్ద ఎలాంటి అవకతవకలు జరగలేదని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఎం సునీత, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో డ్వాక్రా సంఘాల రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎం

30 పడకల ఆస్పత్రిగా నవాబుపేట పీహెచ్‌సీ

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని మండల ప్రజాప్రతినిధులు జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ద్వారా వైద్య శాఖ మంత్రి హరీష్‌రావుకు వినతి పత్రం అందించారు. జడ్చర్లలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు నవాబుపేట పీహెచ్‌సీ చాలా పెద్దదని చాలా మారుమూల గ్రామాలకు కేంద్రంగా ఉందని దాని పరిధిలో దాదాపుగా 75 వేలకు పైగా జనాభా, 54 గ్రామాలు ఉన్నాయని మంత్రికి శనివారం వివరించారు. ఒకే ఒక్క పీహెచ్‌సీతో కాలం గడుపుతున్నామని స్పందించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి 30 పడకల ఆస్పత్రిగా మారుస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు వివరించారు. త్వరలో మార్గదర్శకాలు జారీ చేసి వసతులపై సంబంధిత అధికారులు క్షేత్ర పర్యటన చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారన్నారు. ఈ మేరకు మంత్రి హరీష్‌రావుకు , ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతుబంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

‘అవోపా’ వేసవి శిక్షణ ముగింపు



మెటీరియల్ అందుకుంటున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: అవోపా ఆధ్వర్యంలో నెలరోజులుగా పదోతరగతిలోకి వెళ్లబోతున్న విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ మేరకు స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. పదవ తరగతిలోకి వెళ్లేవారికి ముందస్తు అవగాహన కల్పించటం రాష్ట్రంలో ఇక్కడే జరుగుతోందని అవోపా కార్యవర్గాన్ని అభినందించారు. సమావేశానికి హాజరైన వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ 10 గ్రేడ్ సాధించిన విద్యార్థులకతో విమాన ప్రయాణం చేయిస్తామని ప్రకటించారు. శిక్షణ శిబిరంలో 168మంది విద్యార్థులు, అవోపా అధ్యక్షుడు మురళి కృష్ణ, దాచేపల్లి చంద్రయ్య, యుగంధర్, సత్యనారాయణశెట్టి, గుండ్ల శ్రీను, శివకుమార్, శ్రీధర్‌లు పాల్గొన్నారు. విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు.

సీఎం సభకు భారీగా తరలి వెళ్లాలి



అన్నసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 6న సీఎం కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు రానున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే సభకు భారీగా తరలివెళ్లాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నసాగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ సాధించిన తరుణంలో అనతి కాలంలోనే దేశం గర్వించేలా పదేళ్లకు చేరుకున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని అమరుల త్యాగాలు గుర్తుచేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాబోయే ఎన్నికల్లో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జడ్చర్లలో జరిగిన కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు మాటలు అహంకారపూరితంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాపై ఆయనకు అవగాహన లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ రాజకీయాన్ని వ్యాపారంగా మార్చిందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల్లో కూరుకుపోయేలా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కు దక్కుతుందని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలు ముఖ్యం కాదని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని తెలిపారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధిచెబుతారని అన్నారు.

రమాబాయి వర్ధంతి



గండేడ్: మండలం కేంద్రంలో శనివారం రమాబాయి 88వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్‌వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, డీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మల్కన్న, మైబన్న, చంద్రయ్య, నర్సిములు, సునీల్, వెంకటయ్య, కిష్టయ్య పాండు నాయక్, హనుమంతు పాల్గొన్నారు.

కొనుగోలులో కోతలు విధిస్తే సహించం

మహమ్మదాబాద్: వరిధాన్యం కొనుగోలులో తరుగు పేరున కోతలు విధిస్తే సహించేదిలేదని పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాధిర్యాల్, నంచర్ల కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మిల్లర్లు రెండు కిలోల వరకు తరుగుతీస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన జిల్లా అదనపు కలెక్టర్ సీతారామరాజుకు ఫోన్ చేసి మాట్లాడారు. మహమ్మదాబాద్‌కు చెందిన అశోక్ రైస్ మిల్లులో తరుగు ఎక్కువగా తీస్తున్నారని తెలుపగా ఇప్పటికే లక్ష్మీబాలాజీ రైస్ మిల్లుకు ధాన్యాన్ని నిలిపివేశామని అక్రమాలపై విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డీటీని సెంటర్ దగ్గరికి పంపిస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎ లాంటి నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, ముకుందం, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనండి



క్విజ్‌పై అవగాహన కల్పిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో వచ్చేనెల 18న నిర్వహించే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత అత్యధికంగా పాల్గొనాలని పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గాధిర్యాల్, నంచర్ల, దేశాయిపల్లి, జూలపల్లి, మొకర్లాబాద్, మహమ్మదాబాద్ తదితర గ్రామాల్లో యువతకు శనివారం అవగాహన కల్పించారు. నియోజకవర్గాల వారీగా స్కూటీ, ల్యాప్‌ట్యాప్, స్మార్ట్‌ఫోన్, టాబ్లెట్, స్మార్ట్ వాచ్ తదితర బహుమతులు ఉంటాయని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోయిల్‌కొండ: మండలంలోని ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించనున్నారని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఏ గ్రేడు ప్రకారమే డబ్బులు చెల్లించాలి

చిన్నచింతకుంట: రైతుల ద్వారా కొనుగోలు చేసిన వరి ధాన్యానికి ఏ గ్రేడ్ ప్రకారమే డబ్బులు చెల్లించాలని అప్పంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశాడు. బీ గ్రేడ్ ప్రకారం డబ్బులు చెల్లిస్తామని అధికారులు తెలపడంతో శనివారం సింగిల్ విండో కార్యాలయంలో సీఈఓ గోవిందరాజును కలిసి మాట్లాడారు. ఏగ్రేడ్ ప్రకారమే డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యాలయం పరిధిలోని రైతులు నాణ్యమైన ధాన్యాని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చారన్నారు. కానీ అధికారులు రైతులను మోసం చేస్తు తాలు, తరుగు పేరుతో బీగ్రేడ్ ప్రకారం డబ్బులు చెల్లిస్తామని అందుకు రైతులు అంగీకార పత్రం రాసి ఇవ్వాలని బెదిరిస్తున్నారని అన్నారు. రైతులు బాలేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, రాంరెడ్డి, కొండన్న, అంజన్నతోపాటు పలువురు ఉన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలు ఉత్సాహంతో పని చేయాలని మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి తప్ప ఏ ఒక్కరికి మంచి జరగలేదని అన్నారు. అంతకుముందు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్‌తోనూ తెలంగాణ ప్రాంతానికి ఒరిగిందేమి లేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని అన్నారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి అంజయ్య, మండల అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు పాండురంగారెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, జయశ్రీ, తిరుపతిరెడ్డి, కోస్గి సతీష్‌కుమార్, శ్రీరాములు, ధర్మాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి

మిడ్జిల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రజలకు కార్యకర్తలు వివరించాలని జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ సూచించారు. మోదీ 9 సంవత్సరాల పాలన పూర్తి అయిన సందర్భంగా మండలకేంద్రంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు లాలు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, బాలత్రిపురసుందరి, తిరుపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జర్నలిస్టులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారి సంక్షేమం కోసం రూ.100 కోట్ల నిధి ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మహబూబ్ నగర్ జర్నలిస్టులకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఫాం హౌస్‌లో 155 మంది జర్నలిస్టులకు డబుల్‌బెడ్ రూం ఇళ్ల పట్టాలను శనివారం పంపిణీ చేశారు. తాను కూడా జర్నలిజం చదివానని, జర్నలిస్టుల కష్టాలు, బాధలను దగ్గర నుంచి పరిశీలించానని అన్నారు. ఆదర్శవంతంగా జర్నలిస్టు కాలనీని తీర్చిదిద్దుతామన్నారు. అమర రాజా పరిశ్రమ, ఐటీ పార్క్ నుంచి కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతం 155 మందికి ఇళ్లు కేటాయించామనని ఇంకా ఎవరికైనా మిగిలిపోయి ఉంటే వారికీ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జర్నలిస్టులు మంత్రిని ఘనంగా సన్మానించారు. డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, అర్బన్ తహసీల్దార్ పార్థసారధి, ఆర్‌ఐలు చైతన్య, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో తొమ్మిది రోజుల పాటు కొనసాగిన పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 19న ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయా వార్డుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేశారు. పెద్ద నాలాల్లో పేరుకుపోయిన మురుగును, రోడ్లపై చెత్తాచెదారం తొలగించారు. అనంతరం ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోల ద్వారా కోయిలకొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించారు. చివరిరోజు 29, 45వ వార్డుల పరిధిలో మున్సిపల్ సిబ్బంది వాహనంలో యంత్రం ద్వారా దోమల నివారణకు ఫాగింగ్ తదితర కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించారు.



39వ వార్డులోని రాజేంద్రనగర్‌లో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

ధాన్యంలో తాలు లేకుండా చూసుకోవాలి

రాజాపూర్: రైతులు ధాన్యంలో తాలు లేకుండా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని బాలానగర్, రాజాపూర్ ఉమ్మడి మండలాల ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్ పేర్కొన్నారు. ముదిరెడ్డిపల్లి శివారులో రైతులు ఆరబోసిన వరిధాన్యం కుప్పలను శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలను ధాన్యం తీసుకువచ్చేందుకు రైతులు ఇబ్బందులు పడకుండ వారు ఆరబోసిన చోటుకే హమాలీలు వచ్చి కాంటా చేసి అక్కడే తూకం చేసిన బస్తాలను లోడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. లారీల సమస్య ఉండటంతో యాజమాన్యాలతో మాట్లాడామన్నారు. మూడు లారీలను సమకూర్చినట్లు పేర్కొన్నారు రైతులు ఎర్రన్న, హర్షవర్ధన్‌గౌడ్, బుడ్డయ్య, శివలీల, పర్వతాలుగౌడ్, మల్లేష్‌గౌడ్, బాబులాల్, కుర్వమల్లేష్, తదితరులు ఉన్నారు.